రైజింగ్-2047కు దిశా నిర్దేశం

- ఉన్నతస్థాయి సలహా మండలి ఏర్పాటు
- ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం
- పరిపాలన, ఆర్థిక, విద్య, సాంకేతిక, పర్యావరణ, సామాజిక న్యాయాలపై దృష్టి
- ఎప్పటికప్పుడు మంత్రివర్గానికి సూచనలు, సలహాలు
- డిసెంబరు 9న ప్రజల ముందుకు విజన్ డాక్యుమెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూనే అభివద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకోసం రైజింగ్ తెలంగాణ -2047 నినాదాన్ని ప్రభుత్వం ఎత్తుకుంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలు, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబరు 9న ప్రజల ముందు ఉంచుతామని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. యుపిఎ హయాంలో నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ కౌన్సిల్ ఇచ్చిన సలహాలు సూచనలతోపాటు వామపక్షాల ఒత్తిడి మేరకు ఉపాధి హామీ, ఆహార, అటవీ, సమాచార హక్కు చట్టాలను నాటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇప్పుడు అదే తరహాలో రాష్ట్రంలో సైతం ఒక సలహా మండలిని ఏర్పాటు చేయడం ద్వారా.. దీర్ఘకాలంలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. అందుకే ఆయా రంగాల్లో నిపుణులైన ప్రముఖుల అభిప్రాయాలు, తెలంగాణ ప్రజల అవసరాలు, వనరుల ప్రాతిపదికన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు తెలిసింది. ఇందుకనుగుణంగా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను ఇస్తూ, ఎప్పుడైనా ఎక్కడైనా లోపాలు తలెత్తి, పొరపాట్లు దొర్లితే వాటిని సరిదిద్ది, దిశా నిర్దేశం చేసేందుకు వీలుగా దేశంలోని వివిధ రంగాల్లో నిష్ణాణితులైన వారితో ఒక ఉన్నతస్థాయి సలహా మండలి (హై పవర్డ్ అడ్వైజరీ కౌన్సిల్)ని ఏర్పాటు చేయాలని సిఎం నిర్ణయించారు. సంబంధిత ఆర్డర్‌ను జులై 25న ప్రభుత్వం ఆమోదించింది.

ఆర్బీఐ మాజీ గవర్నర్లు, ప్రముఖ ఆర్థిక వేత్తలు డాక్టర్ దువ్వూరి సుబ్బారావు, డాక్టర్ రఘురామ్ రాజన్, సామాజిక కార్యకర్త, ఆర్‌టిఐ యాక్టివిస్ట్ అరుణా రాయ్, సమ్మిళిత వృద్ధి, ఆహార భద్రత నిపుణురాలు ప్రొఫెసర్ జయతీ ఘోష్, హక్కుల కార్యకర్త, ప్రముఖ న్యాయవాది హర్ష మందిర్‌తోపాటు మొత్తం 16 మంది ఈ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు వారితో ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. కౌన్సిల్ ఉండటానికి వారందరూ అంగీకరించినట్టు తెలిసింది. రాష్ట్రంలో పరిపాలన, ఆర్థిక, విద్య, సాంకేతిక, పర్యావరణ, సామాజిక న్యాయం తదితరాంశాలను ఈ కౌన్సిల్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వానికి తగు సూచనలు చేస్తుంది. ఇందుకవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) అందించనుంది. కాగా విజన్ డాక్యుమెంట్ -2047కు సంబంధించిన క్యాబినెట్ నోట్‌ను జూన్ 23న ప్రభుత్వం ఆమోదించింది. దానిపై ప్రస్తుతం వివిధ స్థాయిల్లో పలు రంగాల్లోని నిపుణులు వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్నారు.

మూడు భాగాలుగా విజన్ డాక్యుమెంట్

అనుకున్న లక్ష్యాలను త్వరితగతిన సాధించేందుకు వీలుగా సలహా మండలి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా విజన్ -2047ను స్వల్ప కాలిక (2025-30), మధ్యకాలిక ((2030-39), దీర్ఘకాలిక (2039-47) అనే మూడు భాగాలుగా విభజించారు. స్వల్పకాలిక లక్ష్యాల సాధన కోసం అన్ని శాఖలు ప్రతీ ఆర్నెల్లు, ఏడాదికి టార్గెట్లను నిర్దేశించుకుని పని చేయాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధి తర్వాత వాటిపై సమీక్షలు చేయాలని కౌన్సిల్ ప్రతిపాదించింది. ఈ క్రమంలో తలెత్తే భౌతిక, ఆర్థిక, సాంకేతిక అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించుకోవాలని సూచించింది.

రైతులు, మహిళలు, యువత అభివృద్ధే లక్ష్యం

విజన్ డాక్యుమెంట్‌లో ప్రధానంగా రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువతపై ఫోకస్ చేసినట్టు సమాచారం. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేయటం, రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చూడటమనేది డాక్యుమెంట్‌లో మొదటి లక్ష్యంగా ఉంది. తెలంగాణలోని కోటి మంది మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించాలన్నది రెండో లక్ష్యం. స్థానికంగా ఉండి చిన్న చిన్న పనులు, చేతి వత్తులు, కుటీర పరిశ్రమల్లో పని చేస్తూ, మెరుగైన వేతనాలను పొందేలా మహిళలను తీర్చిదిద్దాలని డాక్యుమెంట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇక యువతకు విద్య, క్రీడలు, నైపుణ్యాల్లో తర్ఫీదునిచ్చి, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటం, చిన్న చిన్న పారిశ్రామికవేత్తలుగా వారిని తీర్చిదిద్దటమనేది మూడో లక్ష్యంగా ఉంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోవటం, సామర్థ్యాలను మెరుగు పరచటం, పిల్లలకు సరైన పౌష్టికాహారాన్ని అందించటం ద్వారా ఎనీమియాతోపాటు ఇతర రుగ్మతల నుంచి వారిని బయటపడేయటం డాక్యుమెంట్‌లోని నాలుగో లక్ష్యం. వీటితోపాటు గ్రీన్ ఎనర్జీ, సుస్థిర వ్యవసాయం, సుస్థిరాభివద్ధి కోసం గ్రీన్ అర్బన్ ప్లానింగ్ కూడా అందులో కీలకాంశాలుగా ఉన్నాయి.

21న ఒయుకి సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 21న జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని సిఎం నివాసంలో ఆయన్ను కలిసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఒయులో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సిఎం చేతులమీదుగా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా సిఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఒయులో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు-ప్రభుత్వ ప్రణాళిక" అనే విషయంపై సిఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సిఎం రేవంత్ రెడ్డియేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో "సిఎం రీసెర్చ్ ఫెలో షిప్ " తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సిఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వీసీ తెలిపారు.

వరంగల్ పంచాయితీపై ప్రత్యేక కమిటీ వేయండి

- టిపిసిసి చీఫ్‌కు మల్లు రవి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ కాంగ్రెస్ నేతల మధ్య పంచాయితీ, అనంతరం జరిగిన పరిణామాలపై పార్టీ సీనియర్ నేతలతో ప్రత్యేక కమిటీ వేయాలని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ మల్లు రవి కోరారు. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖ రాశారు. ఆ కమిటీ సభ్యులు ఆ జిల్లాకు వెళ్లి విచారణ జరుపుతారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. పలు జిల్లాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే కొండా మురళి రెండు దఫాలుగా క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చే వారం చర్చిస్తామన్నారు. రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ తనతో మాట్లాడారని తెలిపారు. ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించినట్టు చెప్పారు. సమస్య రిపీట్ కాకుండా ఒకసారి చెప్పి చూస్తామని, తిరిగి పునరావృత్తమైతే ఆయనపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. మంత్రి పదవి విషయంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలపై పార్టీ నిశితంగా పరిశీలన చేస్తున్నట్టు ఆయన వివరించారు.

లక్ష్యానికి దూరంగా 'అభివృద్ధి నిధి'

- 40 శాతం దాటని వ్యయం
- నిబంధనలు బేఖాతరు
- ప్రణాళిక వ్యయ శాతంతో పోల్చితే ఏటా లోటు
- అమలుకు నోచుకోని భట్టి ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి నిధులను సంపూర్ణంగా ఖర్చు చేయాలని అధికారులకు పదేపదే చెబుతుంది. కానీ..ఇప్పటి వరకు నిధుల కేటాయింపు, ఖర్చును పరిశీలిస్తే లక్ష్యానికి దూరంగానే ఉంది. ఆ వ్యత్యాసం పూడ్చాలంటే ఆయా శాఖలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే ప్రతి శాఖలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం నిధులు సకాలంలో ఖర్చు చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశాలు ఎలా అమలవుతాయనేది ప్రశ్న. దళిత, గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో ఆయా శాఖల ద్వారా నిధులు కేటాయిస్తున్నట్టు పలు సందర్భాల్లో మంత్రులు ఢంకా బజాయిస్తున్నా...ఆచరణలో కేటాయించిన నిధులు 40శాతం కూడా ఖర్చు కావటం లేదు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెలరోజులకొకసారి వెల్లడించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. అయినా పది శాఖలకు పైగా పైసా ఖర్చు చేయలేదని నివేదికలు వెల్లడిస్తున్నాయి. చట్టం ప్రకారం చేస్తున్న వ్యయం ఆయా వర్గాల్లో ఆదాయం బాగా పెరిగేలా, ఆస్తులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలి. అధికారుల నిర్లక్ష్యం వల్ల అది జరగటం లేదు. సకాలంలో సమీక్షలు నిర్వహించటంలో సర్కారు విఫలమవుతోంది. ఎస్‌సి, ఎస్‌టిలకు ఖర్చు చేయాల్సిన నిధులు నిరుపయోగంగా మారుతున్నాయి.

లక్ష్యానికి దూరంగా..

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిల కోసం ప్రత్యేక అభివద్ధి చట్టం కింద కేటాయిస్తున్న నిధుల ఖర్చు లక్ష్యానికి దూరంగా ఉంటోంది. ఏటా బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ విభాగాల వారీగా భారీగా నిధులు కేటాయిస్తున్నా వ్యయం అంతంతే ఉంటోంది. రాష్ట్ర ప్రణాళిక వ్యయ శాతంతో సమానంగా లేదా అంతకు ఎక్కువగా ఈ నిధులు ఖర్చుచేయాలని నిబంధనలు చెబుతున్నా అలా జరగడం లేదు. చట్టం అమల్లోకి వచ్చినప్పటి(2017-18) నుంచి ఏటా లోటు కనిపిస్తోంది. గతంలో 15నుంచి 25శాతం వరకు లోటు ఉంటే.. గడిచిన రెండేండ్లుగా వ్యత్యాసం 40 శాతం వరకు ఉంటోంది. గతంతో పోలిస్తే వ్యయం కొంత మెరుగ్గా ఉన్నా ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులను వేగంగా ఖర్చుచేయాలని ప్రభుత్వ శాఖలను డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఆదేశించినా అంతగా ఫలితం కనిపించటం లేదని దళిత, గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఖర్చులో నిర్లక్ష్యం

కేటాయింపులు ఘనంగా చేసి, ఖర్చు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. 2019-20లో 12,400.22కోట్లు కేటాయించి, రూ.13,778.98 కోట్లు రిలీజు చేసింది. అందులో ఖర్చు మాత్రం రూ.10,744.79కోట్లు మాత్రమే చేసింది. 2020-21లో రూ.16,534.97 కోట్లు కేటాయించి, రూ.10,223.99 కోట్లు విడుదల చేసి రూ.11,474.80కోట్లు ఖర్చు చేసింది.2021-22లో రూ.21,306.85కోట్లు కేటాయించి, 19,189.61కోట్లు విడుదలచేస్తేఖర్చుచేసింది మాత్రం రూ.16,301.07కోట్లు. 2022-23లో రూ.33,937.76కోట్లు కేటాయించి, రూ.29,110.71కోట్లు విడుదల చేసింది. ఖర్చు రూ.11,430.75కోట్లు మాత్రమే 2024-25లో రూ.ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన రూ. 33.124 కోట్లలో 20,316.38 విడుదల చేసి,అందులో రూ.12,700ఖర్చు అయినట్టు తెలిపారు.

ప్రభుత్వ విభాగాలు కేటాయింపులు..ఖర్చు

ఎస్‌సి కులాలభివృద్ధి శాఖ రూ.1,644.63 కేటాయించి, రూ.1,379.02 కోట్లు బిఆర్ఓ ఇచ్చి, ఖర్చు 542.34 కోట్లు మాత్రమే చేసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ద్వారా రూ.3,278.00కోట్లు కేటాయించి, రూ.1583.67కోట్లు రిలీజ్ ఆర్డర్ ఇచ్చి, రూ.7.47 కోట్లు ఖర్చు చేసింది. వ్యవసాయశాఖలో ఎస్‌సి ప్రత్యేక నిధి కింద ఖర్చు 18.91శాతం ఉంటే.. ఎస్‌టిల్లో 37.82 శాతం ఉంది. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కేటాయించిన నిధుల్లో ఎస్సీ ప్రత్యేక నిధి కింద ఒక్క రూపాయి కూడా ఖర్చుకాలేదు. పంచాయతీరాజ్ శాఖ రెండు విభాగాల కింద రూ.రూ. 936 కోట్లలో కనీసం రూ. 5కోట్లు కూడా ఖర్చుకాలేదు. మహిళా, శిశు సంక్షేమ శాఖలో మాత్రం రూ.250 కోట్లు కేటాయిస్తే ఖర్చు రూ. 420 కోట్లు దాటింది. చట్టంలోని నిబంధనల ప్రకారం గడిచిన సంవత్సరం ఖర్చుకాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి ఆర్థిక సంవత్సరానికి బదిలీ చేయాలి. కానీ ఆ పని జరగడం లేదు. ఈ విషయంపై ఓ అధికారిని ప్రశ్నిస్తే.. అసలు తగిన బడ్జెట్ ఉంటే కదా? ఇవన్నీ చేయటానికి అని అసహనం వ్యక్తం చేశారు.

స్థానికులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజలతో జాన్‌వెస్లీ ముఖాముఖి

- నాగర్‌కర్నూల్ బిసి కాలనీ సిపిఎం బృందం సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కాలనీల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం బిసి కాలనీని సిపిఎం జిల్లా బృందం సందర్శించింది. బృందంతో పాటు జాన్‌వెస్లీ పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. తాము ఎదుర్కొంటున్న బాధలను, ఇబ్బందులను ప్రజలు సిపిఎం నేతలకు వివరించారు. వర్షంలోనే జాన్‌వెస్లీ బీసీ కాలనీలో తిరుగుతూ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి కాలనీ అంతా బురదమయంగా మారిందన్నారు. వర్షాలు పడినప్పుడు అనారోగ్యానికి గురై వైద్యం కోసం వెళ్లాలంటే కాలనీ నుంచి హాస్పిటల్‌కు వెళ్లడానికే గంట ప్రయాణం పడుతోందన్నారు. బిసి కాలనీలోని 17వ వార్డులో 600 కుటుంబాలు 15 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో సందర్శించి స్థానిక సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేస్తున్నా గత పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి కాలనీ మొత్తం సిసి రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి డిమాండ్ వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించొచ్చు కదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు వేసిన రోడ్లకు వీధిలైట్లు వేయాలని, లైట్లు లేక ఇళ్లల్లోకి విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. కాలనీవాసులు చెబుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేయడం అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి తగదని హెచ్చరించారు. అనంతరం కేసరి సముద్రం అలుగు వల్ల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, కందికొండ గీత, జిల్లా నాయకులు రామయ్య, శంకర్‌నాయక్, శ్రీను, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటికాశన్న, ప్రజా సంఘాల నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాళోజీ 'వర్సిటీ' రిజిస్ట్రార్ పోస్టుకు త్వరలో నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఖాళీ అయిన రిజిస్ట్రార్ పోస్టుకు నోటిఫికేషన్ వెలువరించేందుకు వర్సిటీ సిద్ధమైంది. రిజిస్ట్రార్‌గా ఉన్న సుంకరనేని సంధ్య ఇటీవల ఎడిఎంఇ ఉద్యోగోన్నతుల్లో కెఎంసి కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నాగార్జునరెడ్డి కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ రిజిస్ట్రార్‌ను నియమించేందుకు అనుమతించాలని కోరుతూ తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి వైస్‌ఛాన్సలర్ ఆచార్య నందకుమార్‌రెడ్డి తాజాగా లేఖ రాశారు. ఆగస్టు 18 లేదా 19న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. నీట్ యుజి కౌన్సెలింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. అఖిల భారత కోటా మొదటి దశలో సీట్ల భర్తీ ప్రక్రియ సాగుతోంది. త్వరలో సుప్రీంకోర్టులో స్థానికత అంశంపై స్పష్టత వచ్చాక రాష్ట్ర కోటా కింద కాళోజీ వర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వర్సిటీలోని కీలక పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

సమస్యలు రాకుండా సింగూర్ ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారం

- డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే నీరు విడుదల
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగూర్ ప్రాజెక్టుకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యా రాకుండా శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ ప్రాజెక్ట్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం డ్యామ్ సేఫ్టీ అధికారులు కొన్ని సూచనలు చేశారన్నారు. అందుకోసం ప్రభుత్వం రూ.16 కోట్లు విడుదల చేసిందని, దీనికి సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయని చెప్పారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు సూచనలకనుగుణంగా ప్రాజెక్టులో నీటిమట్టాన్ని ఉంచుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతుందని వాటిని దిగువ ప్రాంతాలకు వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అదేవిధంగా సింగూర్ రాజనర్సింహ ఎడమ కాలువను సీసీ చేసేందుకు ప్రభుత్వం రూ.160 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఆ నిధులను ఎడమ కాలువకు పూర్తిగా వినియోగిస్తామని చెప్పారు. ప్రస్తుతం రైతుల కోరిక మేరకు ఆ పనులు నిలిపివేసి వ్యవసాయానికి నీరు అందిస్తున్నామన్నారు. తర్వాత పనులను కొనసాగిస్తామన్నారు. అంతకుముందు మంత్రి దామోదర ఇసోజిపేట గ్రామంలో తెగిపోయిన ఎడమ కాలువను ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులు మండల అధికారులు ఉన్నారు.

అక్టోబర్ 2 నుంచి ప్రయివేట్ సర్వేయర్ల వ్యవస్థ

- 18 నుంచి రెండవ విడత శిక్షణ ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్టోబర్ రెండు నుంచి రాష్ట్రంలో ప్రయివేట్ సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రాబోతున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని 23 జిల్లాల్లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆయా జిల్లాల్లో 18వ తేది ఉదయం పది గంటల లోపు సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై ఆదివారం సంబంధిత అధికారులతో ఆయన హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. మే 26 నుంచి జూలై 26 వరకు ఆయా జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గత నెల 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని తెలిపారు. రెండవ విడత శిక్షణ పూర్తయిన వెంటనే వీరికి లైసెన్స్ జారీ చేయనున్నట్టు వెల్లడించారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ప్రయివేట్ సర్వేయర్ల వ్యవస్థ సేవలను పారదర్శకంగా అందించేందుకు వీలుగా సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధముందన్నారు. ఈ క్రమంలోనే ఈ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ వ్యవస్థపై అపోహలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రాజెక్టుల్లోకి వరద ఉధృతి

- ఎస్ఆర్ఎస్‌పికి కొనసాగుతున్న 1,51,000 క్యూసెక్కుల వరద నీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టుకు వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో జలకళ నిండుకుండలా సంతరించుకుంది. మహారాష్ట్ర పరిసర ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు నమోదు కావడంతో ఎస్ఆర్ఎస్‌పిలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. బాలేగావ్ నుంచి 1.20 లక్షల క్యూసెక్కులు, నిర్మల్ జిల్లా నుంచి 20వేల క్యూసెక్కులు, నిజామాబాద్ జిల్లా నుంచి 10వేల క్యూసెక్కులు వరద ప్రాజెక్టులోకి కొనసాగుతుండగా స్థానికంగా కురుస్తున్న వర్షాలకు వెయ్యి క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1.51 లక్షల క్యూసెక్కుల వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.5 టిఎంసిలు కాగా ప్రస్తుతం.. 1086.80 అడుగులు 65.867 టిఎంసిల నీటిమట్టం కలిగి ఉంది.

నేడు నిజాంసాగర్ గేట్లు ఎత్తే అవకాశం..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 49వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఎఇఇ సాకేత్, అక్షయ్ ఆదివారం తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టిఎంసిలకు గానూ ప్రస్తుతం 13.000 టిఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. సోమవారం ఏ సమయానికైనా ప్రాజెక్ట్ నిండే అవకాశం ఉన్నందున వరద గేట్ల ద్వారా నీటిని మంజీరా నదిలోకి వదలనున్నట్టు తెలిపారు.

హైదరాబాద్ ప్రాపర్టీ షోలో రూ.400 కోట్లకుపైగా వ్యాపారం

- 'బ్రాండ్ హైదరాబాద్'పై విశ్వాసాన్ని మరింత బలపరిచిన క్రెడాయ్'



'క్రెడాయ్' ముగింపు వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ అభివద్ధిదారుల అగ్ర సంఘం క్రెడాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ ప్రాపర్టీ షో 2025 విజయవంతంగా ముగిసింది. 'ఛాయిస్ ఈస్ యువర్స్' థీమ్‌తో జరిగిన ఈ మూడు రోజుల ప్రదర్శనలో 50 వేల మందికి పైగా సందర్శకులు పాల్గొన్నారు. 70కి పైగా ప్రముఖ డెవలపర్లు, 300కిపైగా రెరా అనుమతితో ఉన్న అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్లాట్లు, కమర్షియల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. మొత్తం రూ.400 కోట్లకు పైగా వ్యాపార అవకాశాలు సష్టించడం ఈ ప్రాపర్టీ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ ప్రదర్శనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణను వృద్ధి పథంలో నిలబెట్టడానికి పారదర్శక పెట్టుబడులు, బలమైన మౌలిక వసతుల అభివద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

మూడ్రోజుల ప్రదర్శనలో 23,000కుపైగా క్వాలిఫైడ్ లీడ్స్, 185 సైట్ సందర్శనలు, 35 ఆన్-ది-స్పాట్ సేల్స్ నమోదు కావడం విశేషం. మొత్తం 140 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణ స్థలాన్ని డెవలపర్లు ప్రదర్శించారు.

ఈ ప్రదర్శన ముగింపు వేడుకలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ "పారదర్శకత, బాధ్యతాయుత పాలన రియల్ ఎస్టేట్ రంగానికి బలమైన పునాది" అని పేర్కొన్నారు. కేంద్రం నుండి తెలంగాణ మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు.

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు . జయదీప్ రెడ్డి మాట్లాడుతూ, "క్రెడాయ్ సభ్యులతో నిర్మితమవుతున్న అన్ని ప్రాజెక్టులు రెరా రిజిస్ట్రేషన్ పొందినవే. ఇది కొనుగోలుదారుల్లో విశ్వాసాన్ని పెంచింది" అని అన్నారు. సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిపై ఉన్న అధిక జీఎస్టీని తగ్గించాలని, గహరంగానికి అదనపు పన్ను రాయితీలు ఇవ్వాలని, పర్యావరణ అనుమతులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని అభ్యర్థించారు.

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు జగన్నాథ్ రావు మాట్లాడుతూలి , "హైదరాబాద్ ప్రాపర్టీ షో సిటీని గ్లోబల్ రియల్ ఎస్టేట్ గమ్యస్థానంగా మళ్లీ నిరూపించింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ ఈ ప్రదర్శనకు వచ్చిన స్పందన నగర రియల్ ఎస్టేట్ రంగం ప్రతిఘటన శక్తిని చాటింది" అన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కాంతి కిరణ్ రెడ్డి మాట్లాడుతూ, జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రియల్ ఎస్టేట్‌కు అందకపోవడం డెవలపర్లపై భారమవుతోందని, దీన్ని గహ కొనుగోలుదారులు భరించాల్సి వస్తోందని, ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి హైదరాబాద్ ప్రాపర్టీ షో వచ్చే ఏడాది ఫిబ్రవరి 13 నుండి 15 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుంది.

రాష్ట్రానికి కేటాయించిన యూరియాను వెంటనే సరఫరా చేయాలి

- కేంద్రానికి తెలంగాణ రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన కోటా ప్రకారం యూరియా, ఎరువులను వెంటనే సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. యూరియా సకాలంలో సరఫరా చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో రావడంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడంతో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ సమయంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. అనేక జిల్లాల్లో సహకార సంఘాలు, డీలర్ షాపుల దగ్గర రైతులు బారులు తీరారని పేర్కొన్నారు. సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొరతను అదునుగా చూపించి అనేకమంది డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు రూ.267 వసూలు చేయాల్సి ఉండగా అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి కూడా డీలర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కోరారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్-జూన్ నెలలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినప్పటికీ కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని గుర్తు చేశారు. ఇంకా రాష్ట్రానికి 1.94 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉందనీ, వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతానికి ఆ లోటు 2.24 లక్షల టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక డైరీ డెవలప్మెంట్ యువజన మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చే రూ.14 లక్షలు కాకుండా పెంచి ఇవ్వాలని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఎకరాకు దాదాపు రూ.30 నుండి 40 లక్షలు ఇవ్వాలని ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని భూమికి భూమి ఇవ్వాలని కోరుతూ భూ నిర్వాసితులు ఆదివారం మక్తల్లో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే ఇన్చార్జి మంత్రితో కలిసి భూ నిర్వాసితులందరితో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ బాల్ రెడ్డి, ఉట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ సూర్య ప్రకాశ్ రెడ్డి, మొట్కూర్ మోహన్‌రెడ్డి, భూ నిర్వాసితులు గోపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మేకల నర్సింలు, సంజనోల్ల సంజప్ప, సంజనోల రాము, రామ్ రెడ్డి, చిట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి చోరీ కేసు ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిక్కడపల్లిలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నారాయణ, రాజేశ్వరి దంపతులు వివేక్ నగర్‌లో ఉంటున్నారు. మిథానిలో నారాయణ, బ్యాంకులో రాజేశ్వరి పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. వారి ఏకైక కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. నారాయణ దంపతులకు వివేక్‌నగర్‌లో మూడంతస్తుల సొంత భవనం ఉండగా, రెండో అంతస్తులో వారు నివసిస్తున్నారు. మిగతా వాటిని బంధువులకు అద్దెకు ఇచ్చారు. వృద్ధ దంపతులు ఈ నెల 15న రాత్రి తలుపులు గడియ పెట్టకుండానే నిద్ర పోయారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో లేచి చూడగా, బెడ్‌రూంలోని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో దాచిన 36 తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు కనిపించలేదు. నారాయణ ఫిర్యాదుతో చిక్కడపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. మూడంతస్తుల భవనానికి సమీపంలోని సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. కర్ణాటకకు చెందిన ఓ పాత నేరస్థుడు అదే రోజు రాత్రి స్థానికంగా సంచరించినట్టు గుర్తించారు. నిందితుడు దార్ల నేహేమియా, బంగారాన్ని అమ్మేందుకు సహకరించిన రాయుడు చైతన్య సాయికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులిద్దరిపై గతంలో వేర్వేరుగా పదుల సంఖ్యలో చోరీ కేసులు ఉన్నాయి. నిందితుల నుంచి 25 తులాల బంగారం, రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రగతిశీల భావజాలం విస్తరించాలి

- ఆ బాధ్యత కవులు, రచయితలదే...
- తెలకపల్లి రవి రచనలు అక్షరాయుధాలు
- ఆయన ఒక విజ్ఞానగని
- పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ప్రగతిశీల భావజాలం మరింత విస్తరించాల్సిన అవసరముందనీ, ఆ గురుతర బాధ్యత కవులపైనా, రచయితలపైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. కవి, రచయిత, రాజకీయ విశ్లేషకులు, వ్యాఖ్యాత, సీనియర్ జర్నలిస్టుగా రాష్ట్రంలో పేరుపొందిన తెలకపల్లి రవి ఒక విజ్ఞాన గని అనీ, ఆయన రచనలు అక్షరాయుధాలు అని కొనియాడారు. సందర్భోచితంగా సమయస్ఫూర్తితో తన మాటలను, అక్షరాలను సంధించడంలో ఆయన దిట్ట అన్నారు. తెలకపల్లి రవి రచించిన ఆశయపథం (నవల), అభద్ర (కథలు), సజీవం (కవిత్వం), ప్రజాగానం(సామాజిక ఉద్యమ గీతాలు), మీరే ప్రేరణ..మీదే సాధన(వ్యక్తిత్వ వికాసం), నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం : ఆరుద్ర (సంకలనం) పుస్తకాలను ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రసిద్ధ కవి నిఖిలేశ్వర్, ఎమ్మెల్సీ, వాగ్గేయకారులు గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, నవతెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేశ్, కవి యాకూబ్, సినిమా విమర్శకులు రెంటాల జయదేవ్, కవి, రచయిత పసునూరి రవీందర్ తదితరులు ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి మృతికి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిఖిలేశ్వర్ మాట్లాడుతూ.. కవిత్వ రచన ప్రత్యేకమనీ, వచనం కంటే భిన్నమైనదని అన్నారు. కదిలించేదిగా, ఆలోచింపజేసేదిగా, చైతన్యపరిచేదిగా రవి సాహిత్యం ఉందని కొనియాడారు. కవి గోరటి వెంకన్న మాట్లాడుతూ...రవి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. మెరుగైన సమాజ మార్పు కోసం తనవంతు కృషి చేస్తున్న వారిలో రవి ఒకరని కొనియాడారు. ఆయన రచనలన్నీ బాధితుల పక్షంగానే ఉన్నాయని, అనుభవాలు, అనుభూతులు, స్వీయ పరిశీలనల నుంచి పుట్టికొచ్చినదిగా ఆయన సాహిత్యం ఉందని చెప్పారు. ప్రగతిశీల సాహిత్యం మరింత రావాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. నవతెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేశ్ మాట్లాడుతూ.. పుస్తకాలు నిషేధిస్తున్న కాలంలో ధిక్కార స్వరంతో కూడిన ఆరు రచనలు ఒకేసారి ఆవిష్కరించుకోవడం గొప్ప పరిణామం అన్నారు. తనలాంటి ఎందరో జర్నలిస్టులకు ఆయన గురువు అన్నారు. కవి యాకూబ్ మాట్లాడుతూ... శ్రీశ్రీని కోట్ చేయకుండా రవి మాటలు, రచనలుండవని తెలిపారు. రవి సాంస్కృతిక ఆత్మను ధరించారన్నారు. జనకవనం కార్యక్రమాన్ని రవితో కలిసి నడిపిన అనుభవాలను పంచుకున్నారు. అభద్ర కథలలో సామాజిక స్పృహ ఉందని, ఆయన కథలన్నీ బాధితుల పక్షానే ఉన్నాయని చెప్పారు. కవి, రచయిత పసునూరి రవీందర్ మాట్లాడుతూ... ఆశయపథం నవల కూలిపోరాటాన్ని చక్కగా వివరించిందని, ఆ నవల యధార్థ గాథల ఆధారంగా రచించిన ఒక డాక్యుమెంటరీ అని కొనియాడారు. తెలకపల్లి రవి వెన్నుతట్టి ప్రోత్సహించడం వల్లే తాను ఈ స్థాయికి ఎదిగానని సగర్వంగా చెప్పుకున్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడుతూ.. సమాజానికి ఏదో చేయాలనే తపన రవి రచనల్లో అడుగడుగునా కనిపిస్తోందన్నారు. సినీ విమర్శకులు రెంటాల జయదేవ మాట్లాడుతూ.. రవి రాసే సాహిత్యంలోనూ, మాట్లాడే చర్చావేదికల్లోనూ ప్రవాహశీలత, ప్రాసంగిత, ప్రామాణికత అనే మూడు లక్షణాలు కచ్చితంగా ఉంటాయని కొనియాడారు. తాను మద్రాసు నుంచి వచ్చి తెలుగు జర్నలిజంలోకి అడుగుపెట్టడానికి రవినే కారణమనీ, ఆయన గైడెన్స్‌తో ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ...తన రచనా పరంపర ఇలాగే కొనసాగుతుందన్నారు. ఆశయం చిరంజీవేననీ, అది నిరంతరం ముందుకు నడిపిస్తున్నదని తెలిపారు. డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ప్రాధాన్యత ఉందన్నారు. ఎంత అణచివేత, నిషేధాలు విధించినా పుస్తకం ఎన్నటికీ చిరంజీవినే అని చెప్పారు. ప్రగతిశీల భావజాలంపై దాడి రోజురోజుకీ తీవ్రమవ్వటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మరణించిన కవి, రచయిత తంగిరాల చక్రవర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహా, తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కె. సలీమ, హైదరాబాద్ నగర అధ్యక్షులు ఏబూషి నరసింహ, నాయకులు శరత్ సుదర్శి, రేఖ, తెలకపల్లి రవి కుటుంబ సభ్యులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

దేశీ కుక్కపిల్లల్ని ఆదరించాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశీ కుక్క పిల్లలను దత్తత తీసుకున్నవారు వాటిని కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ పిలుపునిచ్చారు. ఆదివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జలగం వెంగళరావు పార్కులో ఏర్పాటు చేసిన 'ఇండీ పప్పీ దత్తత మేళా'ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఆర్వి కర్ణన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం 'బి ఏ హీరో.. అడాప్ట్ డోంట్ షాప్' అనే నినాదంతో ఆకట్టుకుంది. డీ-వార్మ్ చేసిన, వ్యాక్సిన్ వేసిన, ఆరోగ్యంగా ఉన్న అందమైన 39 దేశీ కుక్కపిల్లలను ఈ మేళాలో ప్రదర్శించారు. కుక్కలంటే ఇష్టపడే ప్రేమికులు ఈ మేళాకు హాజరై ఆసక్తిగా తిలకించారు. తొలి దత్తతగా కూకట్‌పల్లికి చెందిన సీహెచ్ సాయికి ఒక కుక్కపిల్లను కమిషనర్ అందజేసి అభినందించారు. మేళాలో మొత్తం 24 కుక్క పిల్లలను డాగ్ లవర్స్ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దేశీ కుక్కపిల్లలను దత్తత తీసుకున్నవారు వాటిపై చూపుతున్న ప్రేమాభిమానాలు ప్రశంసనీయమన్నారు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఆర్ఎంపి శ్రీనివాస్‌పై కేసు నమోదు

- విచారణ బృందం అధికారి డాక్టర్ గుండగాని శ్రీనివాస్

బ్యూరో - హైదరాబాద్

తుంగుతుర్తిలో చికిత్స వికటించి గర్భిణీ (26) మరణించిన ఘటనలో సదరు ఆర్ఎంపి శ్రీనివాస్‌పై ఎన్ఎంసి చట్ట ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు విచారణ బృందం అధికారి డాక్టర్ గుండగాని శ్రీనివాస్ తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గర్భిణి మరణించిన ఘటనను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సుమోటోగా స్వీకరించింది. ఈ కేసులో విచారణకు డాక్టర్ గుండగాని శ్రీనివాస్, డాక్టర్ విష్ణు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. ఆర్ఎంపీ శ్రీనివాస్ తన తోటి కొంత మంది ఆర్ఎంపీలతో కలిసి మాఫియా మారి లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు గర్భవిచ్ఛిత్తి ఆపరేషన్లు చేస్తున్నట్టు స్థానికులు తెలిపినట్టు వెల్లడించారు. ఆర్ఎంపి శ్రీనివాస్‌పై గతంలో జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇచ్చినప్పటికీ ఆయన చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే గర్భిణి చనిపోయేది కాదని స్థానికుల్లో ఆవేదన కనిపించిందని వెల్లడించారు.

యూరియా అమ్మకాలపై నిఘా పెంచాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యూరియా అమ్మకాలపై నిఘా పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులు కూడా అవసరానికి మించి యూరియాను కొనొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేటాయించిన విధంగా యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో యూరియా కొరతపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, హకా ఎమ్‌డి చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఎమ్‌డీ కె.రాములుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా పరిస్థితులపై డైరెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి సరఫరా కావాల్సిన యూరియాలో పెద్ద లోటు ఏర్పడిందని తెలిపారు. దిగుమతుల ద్వారా సరఫరా కావాల్సిన యూరియా కోటాలో కొన్ని నెలల్లో కంపెనీలు అసలు సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకోకుండానే బిజెపి నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. వానాకాలం సీజన్ ముందస్తుగా ప్రారంభం కావడం, మొక్కజొన్న లాంటి పంటలు అధికంగా సాగు చేయడంతో యూరియా కొరత ఉందన్నారు. యూరియాను వ్యవసాయానికి కాకుండా, ఇతర అవసరాల కోసం మళ్లించకుండా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

యాదాద్రిలో యాత్రికుల కోలాహలం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులతో యాదగిరిగుట్ట కోలాహలంగా మారింది. కుటుంబ సభ్యులతో వచ్చిన యాత్రికులు స్వామి దర్శనం కోసం దర్శన వరుసలో సముదాయాల్లో బారులు తీరారు. దీంతో, సముదాయాలు నిండిపోయాయి. ధర్మదర్శనం గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం నిత్య కైంకర్యాలను ఆలయ ఆచారంగా చేశారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. 126 జంటలు కల్యాణ పర్వంలో పాల్గొని ఆశీస్సులు పొందాయి.

నీళ్ల విలువ రైతులకే తెలుసు : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నీళ్ల విలువ రైతులకే తెలుస్తుంది... రేవంత్ రెడ్డికి, ఉత్తమకుమార్ రెడ్డికి తెలియదు. స్వతహాగా కెసిఆర్ రైతు కాబట్టి ఆయనకు నీటి విలువ తెలుసు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల కోసం రైతులపై పగ ప్రతీకారం తీర్చుకుంటున్నదని అన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలి తప్ప కీడు చేయకూడదన్నారు. కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 62 వేల క్యూసెక్కుల వరద వస్తున్నదని అన్నారు. నంది మేడారంలో కట్క ఒత్తితే రోజుకి రెండు టిఎంసిల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయని, వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తమకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశానన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయని, చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయని, నీళ్లను ఒడిసి పట్టి, వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేసినా ఆన్ చేయలేదని అన్నారు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారన్నారు. అన్నపూర్ణ కెపాసిటీ మూడున్నర టిఎంసిలు... అందులో ఉన్నది కేవలం ఒక టిఎంసి నీళ్లు మాత్రమేనని, రంగనాయక సాగర్ కెపాసిటీ 3 టిఎంసిలకు ఒక టిఎంసి, మల్లన్న సాగర్ కెపాసిటీ 50 టిఎంసిలకు 10 టిఎంసిలు, కొండపోచమ్మ సాగర్ కెపాసిటీ 15 టిఎంసిలకు 4 టిఎంసిలు, బస్వాపూర్ 12 టిఎంసిలకు అర టిఎంసి ఉన్నాయని అన్నారు. ఎస్సారెస్పీలో 61 టీఎంసిలు వచ్చాయనీ, వరద కాలువ ఓపెన్ చేసి మిడ్ మానేరు ఎల్ఎండి ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. అసలు ఇరిగేషన్‌శాఖకు మంత్రి ఉన్నాడా అని ఎద్దేవా చేశారు. 30 టిఎంసిల మిడ్ మానేరులో ఉన్నది కేవలం 10 టిఎంసిలే, ఎల్ఎండిలో కూడా 24 టిఎంసిల్లో కేవలం ఏడుటిఎంసిలు మాత్రమే ఉన్నాయనీ అన్నారు. ఈ రిజర్వాయర్‌లను నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఎల్లంపల్లిలో ఏడు మోటార్లు నడిపితే 22,000 క్యూసెక్కులు మిడ్ మానేరుకు వస్తాయని ఎందుకు మూడు మోటార్లే నడుపుతున్నారని ప్రశ్నించారు. కృష్ణానదిలో హైడెల్ పవర్ ఉచితంగా ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో రోజుకు 42 మిలియన్ యూనిట్లు కరెంటు ఉత్పత్తి అవుతున్నదని అన్నారు. మోటర్లు ఆన్ చేయడం చేతకాకపోతే తామే వేలాదిమంది రైతులతో కదిలి వెళ్లి మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు.. ఇవి ఇంట్లో ఉండే వన్ హెచ్‌పి మోటర్లు కాదు. అలా చేస్తే మోటార్లు పాడైతాయి. బేరింగ్లు పోతాయి. పొద్దున ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మోటార్లు నడిపిస్తున్నారు. ఇది సరికాదు. బిహెచ్ఎల్ కూడా ప్రభుత్వాన్ని హెచ్చరించింది' అన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో గేట్లు ఎత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు కానీ మోటర్లు ఆన్ చేసి నీళ్లను ఒడిసిపట్టడం లేదన్నారు. కమీషన్లకే వారికి సమయం సరిపోవడం లేదని పరిపాలన ఎక్కడ చేస్తారని ఆరోపించారు.

కాలయాపనేనా... వేతనాలు పునరుద్ధరించరా?

- మొక్కుబడిగా మంత్రివర్గ ఉపసంఘం
- బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ సర్కారొచ్చినా పట్టని కార్మిక సంక్షేమం
- పైసా ఖర్చు లేకున్నా అమలుకు నోచుకోని కనీస వేతనాల జిఒలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల తెలంగాణం. పదడుగులు వెనక్కి వేసి చూస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల బతుకులు ఎక్కడ ఉన్నాయో నేడూ అక్కడే ఉన్నాయి. యాజమాన్యాలకు లాలూచీ పడో...కార్మికులే కదా అన్న చిన్నచూపోగానీ ఖజానాపై పైసా భారం పడకున్నా కార్మికులకు కనీస వేతనాలు పెంచడానికి పాలకులకు మనసొప్పట్లేదు. కనీస వేతనాల జీవోల సవరణ విషయంలో బీఆర్ఎస్ పాలకులు పదేండ్లు తాత్సారం చేయగా... కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన కొత్త జీవోలు మేడిపండు చందంగా మారాయి. కనీస వేతనాలపై అధ్యయనం, వేతనాల నిర్ణయం కోసం ముగ్గురు మంత్రులతో వేసిన కమిటీ ముడిపడట్లేదు. నెలరోజుల్లో రిపోర్టు ఇవ్వాలనే సూచన బుట్టదాఖలైంది. రెండు నెలలు కావస్తూ ఒక్కసారి కూడా ఆ కమిటీ భేటీ కాలేదంటేనే పాలకులకు కార్మికుల వేతనాల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల పరిధిలో కోటీ 25 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వాళ్లకు వేతనాలు పెరగక 14 ఏళ్లవుతోంది. జిఒలు సవరించలేదు. రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చాక మినిమం వేజ్ జీవోలను సవరించి కొత్త జీవోలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. జిఒలు కొత్తవైనా వేతనాలు మాత్రం పాతవే. ఇప్పుడు ఇస్తున్న వేతనానికి బేసిక్‌కు పెరిగిన డిఎను కలిపి మొత్తం జీతంగా పరిగణించారు. కొత్త డిఎను యాడ్ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జిఒల పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

అన్యాయం జరుగుతున్నదిలా...

1991 లెక్కల ప్రకారం విడిఎను ప్రామాణికంగా తీసుకుని మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను లెక్కించి పెంచుకుంటూ పోతే నేడు కనీస వేతనం రూ.28 వేలకుపైగా ఉండేది. కానీ, 2000 సంవత్సరంలో పాయింట్ విడిఎ రేటును రూ.13.75 పై నుంచి రూ.10:50 పైసలకు పాలకులు తగ్గించారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడిఎ రేట్ల స్లాబ్‌లను మార్చేసింది. దీంతో పెరగాల్సిన వేతనాలు కాస్తా క్షీణించాయి. 2009లో కనీస వేతనాల సలహా మండలి కనీస వేతనాలను రూ.12,500 నుంచి 14,500కు సిఫారసు చేసింది. కానీ, ఇప్పటివరకూ దానికి ఆమోదం లభించలేదు. 2017 నుంచి 2021 వరకు అమల్లో ఉన్న కనీస వేతనాల సలహా మండలి సిఫారసు మేరకు ఐదు జీవోలను గత సర్కారు గెజిట్ చేసింది. కానీ, యాజమాన్యాల ఒత్తిడితో నేటికీ వర్తింపజేయడం లేదు.

సుప్రీం కోర్టు తీర్పూ బుట్టదాఖలు

వివిధ షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించడం, యాజమాన్యాలు కార్మికులపై యాజమాన్యాల శ్రమదోపిడీ నిరోధించడమే లక్ష్యంగా కనీస వేతన చట్టం 1948 వచ్చింది. కనీస వేతనాలు నిర్ణయించడంలో ఆక్ట్రాయ్ సిఫారసులు, సుప్రీం కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలి. కుటుంబ అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం నిర్ణయించాలని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్-1957 సిఫారసు చేసింది. దాని ప్రకారం భార్యాభర్తలిద్దరూ రెండు యూనిట్లు, ఇద్దరు పిల్లలు ఒక యూనిట్‌గా మొత్తం మూడు వినిమయ యూనిట్లుగా కనీస వేతనాన్ని నిర్ణయించాలి. రోజుకు ఒక వ్యక్తి కనీసం 2700 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం ఖర్చు, సంవత్సరానికి 72 గజాల బట్ట, ఇంటి కిరాయి, ఇతరత్రా ఖర్చులకు కొంత కలిపి కనీస వేతనాన్ని నిర్ధారించాలి. దానికి అదనంగా మరో 25 శాతం కలిపి కనీస వేతనంగా నిర్ణయించాలని 1992లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. కనీస వేతనం రూ.18 వేలు ఉండాలని ఏడో పే కమిషన్ తేల్చిచెప్పింది. పై లెక్కల ప్రకారం చూస్తే 2024 నాటికి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో లెక్కిస్తే కనీస వేతనం రూ.27,540 ఉండాలి. పాలకులు ఈ ప్రతిపాదనల్లో వేటినీ అమలు చేయడం లేదు. దీంతో పది పన్నెండు గంటలు పనిచేసినా మెజార్టీ కార్మికులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల లోపే వేతనం దక్కుతున్నది.

సలహామండళ్ల సూచనలు గాలికి...

ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు, తెలంగాణ ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుతో కార్మికవర్గం తీవ్రంగా నష్టపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ నాలుగు కనీస వేతనాల సలహామండళ్లను ఏర్పాటు చేశారు. 2021 జూన్‌లో ఇచ్చిన ఐదు షెడ్యూల్ పరిశ్రమలకు వేతనాలు పెంచుతూ బిఆర్ఎస్ సర్కారు ఫైనల్ చేసింది. వాటి పరిధిలో రాష్ట్రంలో 47 లక్షల మందికి లబ్ధి చేకూరబోతోందనే సంతోషం కాస్త మొగ్గదశలోనే ఆవిరైంది. ఏమైందో ఏమోగానీ నేటికీ అవి గెజిట్ రూపం దాల్చలేదు. యాజమాన్యాల ఒత్తిడితో అప్పటి సర్కారు వెనకడుగు వేసిందనే విమర్శలొచ్చాయి. దాని ఫలితంగా ఇప్పటిదాకా కార్మికులు నెలకు మూడు వేల కోట్లు నష్టపోతున్నారు. మిగిలిన 68 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ప్రతి నెలా ఆరు వేల కోట్లు నష్టపోతున్నారు. పాలకులు ఇలా చేయడమంటే శ్రమ దోపిడీని ప్రోత్సహిస్తూ పారిశ్రామిక వేత్తలకు వత్తాసు పలుకడమే అవుతుంది.

మంత్రి వర్గ ఉపసంఘమైనా తేల్చేనా?

రాష్ట్రంలో మెరుగైన కనీస వేతనం నిర్ణయించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామిలతో మంత్రి వర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దానికి చైర్మెన్‌గా మల్లు భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. దీనికి సంబంధించిన జిఒ 848ని రాష్ట్ర సర్కారు జూన్ 27న విడుదల చేసింది. నెలరోజుల్లోనే అధ్యయన రిపోర్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. కానీ, ఆ కమిటీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా భేటీ కాలేదు. కనీస వేతనాలు ఎంత ఉండాలనే దాన్ని తేల్చలేదు.

కనీస వేతనాల చట్టానికి తూట్లు పొడిచి అన్యాయం చేస్తారా? : పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కనీస వేతనాల చట్టానికి తూట్లు పొడిచి అన్యాయం చేస్తారా? ఇదెక్కడి అన్యాయం. కనీస జిఒలను సవరిస్తామని ఎన్నికల హామీలో కాంగ్రెస్ నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక వేతనాలు పెంచలేదుగానీ కొత్తజీవోలిచ్చారు. ఇది సరిగాదు. కనీస వేతనాల సలహామండలి బోర్డు అధికారాలను హరించేందుకు సబ్ కమిటీ వేశారనే చర్చా నడుస్తున్నది. కనీస వేతనాల బోర్డులో గుర్తింపు పొందిన కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని విడనాడి కనీస వేతనాల సలహా మండలి సిఫారసుల మేరకు మొత్తం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కోటీ 20 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను పెంచాలి. కనీస వేతనాల పెంపు కోసం కార్మికులంతా పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని సిఐటియుగా పిలుపునిస్తున్నాం.

డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా సోమయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నల్లగొండకు చెందిన ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా హన్మకొండకు చెందిన టి లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని టిఎన్‌జిఒ భవన్‌లో జరిగిన 15వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది.

ఉపాధ్యక్షులుగా పి శంతన్, వి.రాజిరెడ్డి, టి శ్రీశైలం, బి రేణుక, చాప బాబు, కార్యదర్శులుగా ఎం సామ్యూల్, జె.రామ స్వామి, ఎ.శ్రీనివాసరెడ్డి బి.శ్యామ్, ఆర్. లింగయ్యలను సమావేశం ఎన్నుకుంది. అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులుగా డాక్టర్. ఎం.గంగాధర్, ఆడిట్ కమిటీగా కన్వీనర్‌గా పి.ఈశ్వర్‌రెడ్డి సభ్యులుగా సీహెచ్.వెంకటేశ్వర్లు, బి.సదానందంకు బాధ్యతలు అప్పగించారు.

అమ్మ 'బంధం' తెగుతోంది

రాష్ట్రంలో పదిరెట్లు
పెరిగిన అబార్షన్లు
మారుతున్న సమాజపోకడలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సృష్టికి ప్రతిసృష్టి చేసే అమ్మతనం పేగుబంధాన్ని తెంచేసుకుంటోంది. భయమో, భారమో, బాధ్యతారాహిత్యమో అర్థంకాక గర్భస్థ శిశువుల్ని తల్లులు కడుపులోనే చిదిమేస్తున్నారు. ఓవైపు మహిళల్లో పునరుత్పత్తి శక్తి సన్నగిల్లుతోందని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. దానికి మారుతున్న ఆలోచనలు, బాధ్యతలు, ఆహార అలవాట్లు, సమాజ పోకడలు సహా అనేక కారణాలు ఉన్నాయి. కానీ గర్భం ధరించినా, బిడ్డల్ని వద్దనుకొనే తల్లులూ లేకపోలేదు. దీనికి కారణాలు అనేకం. గడచిన ఐదేళ్లలో తెలంగాణలో పదిరెట్లు అబార్షన్లు పెరిగాయి. ఈ విషయాన్ని స్వయంగా పార్లమెంటులోనే ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా అబార్షన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఓవైపు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచమని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని కోరుతున్నాయి. గతంలో కుటుంబ నియంత్రణ పాటిస్తే ఇచ్చిన ప్రయోజనాలకంటే, ఎక్కువ మంది పిల్లల్ని కంటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామనీ హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న అబార్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 2020-21లో తెలంగాణలో 2,282 అబార్షన్లు నమోదయ్యాయి. 2024-25 నాటికి ఈ సంఖ్య పదిరెట్లు పెరిగి, 16,059 అబార్షన్లు జరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఈ లెక్కల్ని పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్ఎంఐఎస్) వెల్లడించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గడచిన ఐదేండ్లలో అబార్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. ఈ రాష్ట్రంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో 2,282 అబార్షన్లు జరగ్గా, 2024-25 నాటికి ఈ సంఖ్య10,676కు పెరిగింది. దేశవ్యాప్తంగా అబార్షన్లు అధికంగా జరిగిన టాప్-5 రాష్ట్రాల వివరాలను హెచ్ఎంఐఎస్ ప్రకటించింది. అబార్షన్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,07,019 అబార్షన్లు జరిగాయి. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు- 1,01,414, అస్సాం- 76,642, కర్నాటక- 70,241, రాజస్థాన్- 53,714 ఉన్నాయి. అయితే ఈ అబార్షన్ల వెనుక అనేక విషాద ఘటనలు ఉన్నాయి. మెడికల్ అన్‌ఫిట్‌తో అబార్షన్లు కావడం వేరు... ఉద్దేశ్యపూర్వకంగా గర్భ విచ్ఛిత్తి చేయించుకోవడం వేరు. సమాజంపై ముఖ్యంగా మహిళల మానసిక, శారీరక ఆరోగ్య పరిస్థితులపై అబార్షన్లు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.

ఇటీవల హైదరాబాద్ సంజీవరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక గర్భవతి అయ్యింది. ఈ విషయం తెలిసి ఆ బాలిక తల్లి అబార్షన్‌కు అనుమతించాలని కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్ భీమపాక విచారించారు. ఈ కేసు విషయంలో న్యాయస్థానం ఏర్పాటుచేసిన వైద్య బృందం సమర్పించిన నివేదిక ప్రకారం సదరు బాలికకు 28 వారాలుగా ట్విన్ ఫీటస్ ఉందని, ఈ దశలో అబార్షన్ చేస్తే తల్లి, శిశువుల ప్రాణాలకు ప్రమాదం కలగొచ్చని పేర్కొంది. దీనితో హైకోర్టు అబార్షన్‌కు అనుమతించలేదు. అబార్షన్ల సంఖ్య పెరుగుదలపై సమాజంలో ఆందోళనలు పెరుగుతున్నాయి.

దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత కచ్చితంగా ప్రభుత్వాలపై ఉంది. ఇటీవలి కాలంలో హైదరాబాద్, బెంగుళూరు, ముంబయి లాంటి సిటీల్లో సహజీవనం (కో లివింగ్) కల్చర్ పెరిగిపోతోంది. ఇందుకు కారణం యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, పాశ్చాత్య సంస్కృతి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 'కో లివింగ్' హాస్టల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి ఐటీ కంపెనీల్లో పనిచేసేందుకు దేశం నలుమూలల నుంచి యువతీ యువకులు వస్తుంటారు.

ఒకే ఆఫీసులో పనిచేస్తూ, కో లివింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే సమయంలో తెలిసీ తెలియని వయసులో మైనర్ బాలికలు గర్భం దాల్చడం, పరువు పోతుందనే భయంతో తల్లిదండ్రులు కుల పంచాయతీలు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించడం ఆనవాయితీగా మారుతోంది. మరోవైపు ఆదివాసీ, గిరిజన ప్రాంతాల మహిళలకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడం, పౌష్టికాహారం లేకపోవడం వంటివి కూడా అబార్షన్ల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. మరోవైపు ఆర్థిక భద్రత ఉన్నా, ఇప్పట్లో సంతానం వద్దనుకొనే దంపతుల సంఖ్యా పెరుగుతోంది. ఉన్నంతకాలం ఎంజాయ్ చేద్దాం అనే ధోరణి ప్రబలుతోంది. గర్భం దాల్చినట్టు తెలియగానే అబార్షన్లు చేయించుకుంటున్నారు. ఈ తరహా ధోరణులు సమాజంలో ఆందోళన కల్గించే అంశాలే!!